

# పుత్రస్య గతిర్నాస్తి...

- ఎస్. పద్మావతీదేవి

నూతిగట్టు దగ్గర ఆడుకుంటున్న పిల్లల్ని గదమాయించి వాళ్ళను లోపలికి తేవాలని వెళ్తున్న సత్యవతి తులసి కోట ముందు మోకాళ్ళపై తల వాల్చుకుని కూర్చున్న కృష్ణవేణిని చూసింది.

దగ్గరగా వెళ్ళి "కృష్ణా!" అని పిలిచింది మృదువుగా.

ఉలిక్కిపడి తన కన్నీరు ఆవిడ కంట పడకుండా తల పక్కకి తిప్పుకుందామె. అది ఎలాగూ గమనించింది సత్యవతి.

"కృష్ణా! ఏమిటమ్మా ఇది? అస్తమానం అలా ఒంటరిగా కూర్చుని బాధపడుతూ ఉండటమేనా నీ పని? నేనేం చేస్తే నీ బాధ మరిపించగలనో చెప్పమ్మా!" అన్నది.

గబుక్కున ఆవిడ రెండు చేతులూ పట్టుకుంది కృష్ణవేణి.

"దొడ్డమ్మా! అంత మాటనకు. నువ్వు నాకు చేసిన లోపం ఏమీలేదు. నాకే మనసు బాగాలేక ఇలా కూర్చున్నాను. కన్నతల్లిని మరిపించే నీ ఆదరణలో నాకేం తక్కువ దొడ్డమ్మా!" నవ్వడానికి ప్రయత్నిస్తూ అంది.

ఆ చేతులు విడిపించుకుని దీర్ఘంగా నిట్టూర్పు విడిచింది సత్యవతి.

"కృష్ణా! నిజం చెప్పు. మళ్ళీ భారతి ఏమైనా అందా?" ఆమె కళ్ళలోకి పరిశీలనగా చూస్తూ అడిగింది. ఆ చూపుల్లో తీక్షణకీ, ఆమె కంఠంలో గాంభీర్యానికి తడబడిపోయింది కృష్ణవేణి.

"భారతా? భారతి ఏమంటుంది దొడ్డమ్మా! ఏం అనలేదు. నాకే ఆయన గుర్తుకి వచ్చి.... బాధగా అన్పించింది."

"నువ్వు నా ఇంట్లో ఉంటున్న కారణంగా తప్పు చెయ్యకున్నా మాటలు పడనవసరం లేదు కృష్ణా! నా మీద ఒట్టేసి చెప్పు. భారతి ఏమీ అనలేదని?" సత్యవతి నిక్కచ్చిగా అడిగింది.

"నిజం దొడ్డమ్మా! నా మాట నమ్ము. తనేమీ అనలేదు." నిస్సహాయంగా చూసింది కృష్ణవేణి.

కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది సత్యవతి. ఆమె కన్నుల ముందు ఆ ఉదయం జరిగిన సంఘటన కదలాడింది. వంటింట్లో అందరూ కాఫీ తాగుతున్న సమయంలో కృష్ణవేణి తన కూతురి స్కూల్ ఫీజు గురించి గుర్తు చేసింది సత్యవతికి.

సత్యవతి తల ఊపినా భారతి మాత్రం నిరసనగా ముఖం చిట్లించటం గమనించింది.

అంతా కాఫీలు తాగి వెళ్ళిపోయాక భర్త దగ్గర రుసరుసలాడింది భారతి.

"మనమూ, మన కుటుంబమూ సరిపోలేదా మీ అమ్మకి? ఇంకా ఆవిడ పిల్లల్ని కూడా చదివించాలా? అందరి ముందూ తలెగరేసి అనక మీ నెత్తినే చెయ్యేస్తారు. చూస్తూ ఉండండి. అయినా ఒక మనిషే మరొకరికి భారం అన్పించే ఈరోజుల్లో ఆవిడనీ ఆవిడ పిల్లలనీ పోషించింది చాలక ఇంకా చదువులు కూడానా? ఇంక చదువులు చాలించి దాన్ని ఇంటిపట్టున ఉండమనండి. ఊరి వాళ్ళందరినీ నెత్తిన పెట్టుకునేందుకు మనం సన్యాసులం కాము. సంసారులం!" భార్య మాటలు వింటూ మౌనంగా కాఫీ త్రాగుతున్నాడు శంకరం.

"అలా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడం కాదు. ఈ ఖర్చులు నావల్ల కాదు అని కచ్చితంగా చెప్పేయండి. వాళ్ళు నాలుగు తీయని కబుర్లు చెప్పగానే జేబులో ఉన్నది కాస్త అందించేస్తారు మీరు. నాకు తెలుసు.... మీకు చేతకాకపోతే నేను

చెప్తాను. అంతేకానీ మీరిలాంటివేమీ పూసుకోకండి. ఏమిటి, వింటున్నారా?'' అని గద్దించింది భారతి.

''పాపం, అక్కయ్యకి మాత్రం ఎవరున్నారు భారతీ!'' నెమ్మదిగా అన్నాడు శంకరం.

''అయిందీ, నేను చెప్పినదంతా గంగపాలు అయింది. ఎవరూ లేరు కనుకే మన నెత్తికెక్కి ఏలుతున్నారు; అది చాలదూ? 'చదువులూ, సంధ్యలూ అంటూ ఉన్నదంతా వాళ్ళకి ధారపోస్తే మాత్రం నేను సహించను. ముందు మీ దగ్గరున్న డబ్బు నాకిలా ఇవ్వండి!'' అంటూ భర్త దగ్గరి నుంచి డబ్బు తీసుకుని తన దగ్గర అట్టే పెట్టుకుంది.

శంకరం ఆఫీస్‌కి వెళ్తున్న సమయంలో సత్యవతి డబ్బు అడిగింది.

''డబ్బు భారతి దగ్గర ఉందమ్మా! అడిగి తీసుకో!'' అన్నాడు.

అప్పుడే అక్కడకు వచ్చింది భారతి, ''ఏమిటత్తయ్యగారూ!'' అంటూ.

''చంటి స్కూల్ ఫీజు కట్టాలమ్మా! ముప్పయి రూపాయలు వుంటే ఇవ్వు!'' అన్నది సత్యవతి.

''అయ్యో, ఆ డబ్బు ఇందాక పక్కింటావిడ అడిగితే ఇచ్చానత్తయ్యా! మళ్ళీ రెండు రోజుల్లో ఇచ్చేస్తానందావిడ. మిగిలిన పది రూపాయలు ఇదిగో,'' అంటూ నోటు అత్తగారి చేతిలో పెట్టింది భారతి.

ఒక్కక్షణం చేతిలో పదిరూపాయల వంక చూసి సన్నగా తల పంకించి వెళ్ళిపోయింది సత్యవతి. విజయగర్వంతో భర్త వంక చూసింది భారతి.

సత్యవతీ, కృష్ణవేణి, భారతీ భోజనాలు చేస్తున్నారు.

''పక్కింటావిడకి అప్పు ఎందుకిచ్చావమ్మా భారతీ! ఆవిడ తిరిగి ఇచ్చేందుకు ఎన్నిసార్లు తిప్పుతుంది'' అంది కృష్ణవేణి.

''పోనీలెండి వదినగారూ! ఎవరి సొమ్ము ఎవరికి ప్రాప్తమో! మనం సంపాదించినదంతా మనవాళ్ళే తింటారని ఎక్కడుంది? అవసరం అని అడిగింది ఇచ్చాను!'' వ్యంగ్యంగా నవ్వుతూ అంది భారతి.

బాణం దెబ్బలా తగిలిందా మాట కృష్ణవేణికి. సత్యవతి కోడలిని ఓరకంట చూసింది. తల తిప్పి కృష్ణవేణిని చూసింది. అప్పటికే కృష్ణవేణి ముఖం తెల్లగా పాలిపోయింది. చిరునవ్వుతో భారతి వైపు చూస్తూ, ''చూడమ్మా, భారతీ! ఇక్కడ తాతలు సంపాదించిన ఆస్తిగానీ ఆ పైన మనం పుట్టింట నుంచి తెచ్చుకున్న ఆస్తులుగానీ ఏవీ లేవమ్మా! అంతా రెక్కల కష్టం మీద సంపాదించినవే. కష్టపడి సంపాదించిన సొమ్ము కదా, అది పాడయిపోతుంది అని కృష్ణవేణి అలా అంది. ఇకపోతే మన పక్కింటావిడ తన డబ్బు తాను జాగ్రత్త చేసుకుని ఇతరుల ద్వారా అవసరాలు తీర్చేసుకుందాం అనుకునే రకం. డబ్బు దగ్గర ప్రతి ఒక్కరికీ జాగ్రత్తే కదా! ఆవిడ స్వభావం తెలిసి కూడా ఆవిడకు డబ్బివ్వటం మంచి పనికాదు!'' అన్నది సత్యవతి.

ఇందాక తనన్న మాటకన్నా చురకల్లా తగిలాయి భారతికి ఈ మాటలు. ఉద్రేకంతో ఉడికిపోయింది.

''ఏం అవసరం వచ్చి అడిగిందో ఏమో, ఇచ్చాను. ఆ మాత్రం నా మొగుడి సొమ్ము నేను స్వతంత్రించి ఇవ్వకూడదా?'' రెచ్చిపోతూ అడిగింది భారతి.

కృష్ణవేణి నివ్వెరబోయి చూసింది. భారతి అలా అంటుందని ఊహించలేదామె. సత్యవతి కోడలిని పరిశీలనగా చూసింది.

అత్తగారి మౌనం భారతికి మరింత ఆసరా ఇచ్చింది.

''ఒక యాభై రూపాయలు తీసి ఇచ్చానో లేదో లక్ష ఆరాలు తీస్తోందీవిడ. నేనే అందరి కోడళ్ళలాంటిదాన్ని అయితే మా ఆయన సంపాదించినదంతా మా పుట్టింటికి చేరవేసేదాన్ని. నాకలాంటి అలవాట్లు లేవు కనుకే ఇలా మాటలు పడుతున్నాను. అయినా మధ్యన మా పుట్టింటి వాళ్ళు ఎందుకు ఇస్తారు? ఓ కొంపా, నాలుగురాళ్ళ సంపాదించే ఉద్యోగమూ ఉందని ఇచ్చారే కానీ ఇలాంటి బాధ్యతలున్నాయని తెలిస్తే వాళ్ళూ ఇవ్వకపోదురు. అయినా అత్తయ్యగారూ! మీకు కోపం వస్తే వస్తుందేమో కానీ ఈ అక్కరకు రాని బాధ్యతలు ఆయనొక్కరే మోయాలంటే కుదరదు. మాకూ పిల్లలున్నారు. వాళ్ళ భవిష్యత్తు చక్కదిద్దాల్సిన బాధ్యత కూడా ఉంది. ఆ పైన మీరే ఆలోచించుకోండి?'' నిర్మోహమాటంగా చెప్పి కంచంలో చేయి కడిగేసుకుని లేచింది భారతి. ఆ సమయంలో శంకరం అక్కడే ఉన్నాడు. అతని తండ్రి రాజయ్య లోపల ఉన్నారు.

అంతా విని శంకరం వైపు చూసింది సత్యవతి.

అతడి ముఖంలో ఎలాంటి భావం లేదు. ఆ మాటలతో తనకు ప్రమేయం లేదన్నట్లు ఉన్నాయి అతడి ముఖ కవళికలు.

మౌనంగా తను కూడా వెళ్ళిపోయింది సత్యవతి. కృష్ణవేణి ఎప్పుడో వెళ్ళిపోయింది అక్కడనుంచి.

ఆ సంఘటనే మరిచిపోలేక ఈమె బాధపడుతున్నదని అర్థం చేసుకుంది సత్యవతి. లాలనగా ఆమె జుట్టు సవరించింది.

''చూడమ్మా కృష్ణా! నేనూ మీ పెదనాన్నా ఉన్నన్నాళ్ళూ నీకే బెంగా అక్కర్లేదు. నువ్వు ఎవరి మాటలూ పట్టించుకోకు. భారతి చెప్పినట్లు దీనికి పరిష్కారం నేను ఆలోచిస్తాను,'' అని లోపలకు వెళ్ళిపోయిందావిడ.

ఆ రోజు సాయంకాలం వాళ్ళ పరిచయస్థుల అబ్బాయి చూసిపోదామని వచ్చాడు.

''రాజూ! మాకో చిన్న ఇల్లు అద్దెకి కావాలయ్యా! వందలోగా ఏదైనా ఇల్లు చూసి పెట్టు,'' అన్నది సత్యవతి.

''మీకా, మీకెందుకండీ ఇల్లు?'' ఆశ్చర్యంగా అడిగాడు ఆ అబ్బాయి.

వింటున్న భారతీ, కృష్ణవేణి కూడా ఆశ్చర్యపోయారు.

''కావాలిలే రాజూ! తొందరలో చూడు. నీకు తెలుస్తుంది కదా!''

''కావాలంటే ఇప్పుడే రెడీగా వుందండీ! అద్దె ఎనభై రూపాయలు. కానీ చిన్న ఇల్లు. మీకు చాలుతుందో లేదో!'' అన్నాడు అతను అనుమానంగా.

''పరిస్థితులు అలా వస్తే ఎలాంటి చోట అయినా వుండాలి కదా నాయనా! వాళ్ళతో మాట్లాడి ఒక నెల అద్దె అడ్వాన్సు ఇచ్చేయి. మళ్ళీ ఎవరైనా దిగిపోవచ్చు.''

వింటున్న భారతి ఆత్రం పట్టలేకపోయింది. రాత్రి భర్త రాగానే అతనికి ఆ విషయం చెప్పింది. విని అతడు కూడా చకితుడయ్యాడు.

''ఇప్పుడు మరో ఇంటి అవసరం ఏమొచ్చింది? అమ్మ ఎందుకలా అడిగింది?'' అని అడిగాడు.

''ఏమో, నేనలా అన్నానని కోపం వచ్చిందేమో? మరేం ఫర్వాలేదు వెళ్ళనీయండి. ఆ మూకకంతా ఈ ఇల్లు ఎలాగూ సరిపోవటం లేదు. కాస్త ప్రశాంతంగా ఉండవచ్చు!'' సంతోషంగా అన్నది భారతి.

"అదేమిటి భారతీ! మనం ఊళ్ళో వుంటూ వాళ్ళు వేరే వుంటూ వుంటే నలుగురూ ఏమను కుంటారు''

"ఆఁ....సింగినాదం ఎవరూ ఏమీ అనుకోరు. ముసలాళ్ళకి రానురానూ ఛాందస్సం పెరుగుతోంది. వాళ్ళకి నేను చేయలేను బాబూ! ఏదో వాళ్ళదారి వాళ్ళను చూసుకోనివ్వండి. మీ నాన్నగారికి వచ్చే ఆ కొద్దిపాటి పెన్షన్ మనకిస్తారో లేదో కానీ ముందు వాళ్ళందరినీ మనం పోషించాలి. నేను ముసలాళ్ళతో బాధలు పడలేను. మీరు మాత్రం ఏమీ మాట్లాడకండి. ఎలా చేస్తే అలా చేయ నీయండి. వాళ్ళేం ఒంటరివాళ్ళయిపోరు. మిగతా ఇద్దరు కొడుకులకు లేని బాధ, బాధ్యతా మీకేనేమిటి పట్టింది? మీ అమ్మ నాలుగు కమ్మని కబుర్లు చెప్పగానే మీరు అయిసైపోకండి!'' అని భర్తకి హితబోధ చేసింది భారతి.

అలాంటి భర్తలందరూ ఆ సమయంలో ఎలా ఉంటారో అలాగే స్తబ్ధగా ఉండిపోయాడు శంకరం.

నాలుగు రోజులు మామూలుగా గడిచాయి. అత్తగారూ మామగారూ ఎలాగూ వెళ్ళిపోతున్నారన్న నిశ్చింతతో సరదాగా ఉంది భారతికి ఆ నాలుగు రోజులు.

నాలుగో రోజు రాత్రి భోజనాలయ్యాక కొడుకుని పిలిచింది సత్యవతి.

"శంకరం! ఈ రోజు దశమి, బుధవారం.... వారం, నక్షత్రం కూడా మంచివే. పైగా ఇప్పుడు వర్జ్యం కూడా లేదు. ఆ ఇంటికి మారిపోతే బాగుంటుంది.'' అన్నది ఆమె.

ఒకసారి ఇబ్బందిగా భార్యవైపు చూశాడు శంకరం. చూసి తల్లితో

"ఇప్పుడు మీరు వేరే ఎందుకమ్మా వెళ్ళడం?'' అన్నాడు. భారతి లోలోన పళ్ళు నూరుకుంది. చిరునవ్వు నవ్వింది సత్యవతి.


"మేము కాదు బాబూ! నువ్వూ, భారతీ, పిల్లలూ!'' ప్రశాంతంగా చెప్పిందామె.

తుళ్ళిపడింది భారతి. శంకరం కూడా అదే స్థితిలో ఉన్నాడు. కృష్ణవేణి తల వంచుకుని కూర్చుంది. కొన్ని క్షణాలు వారి మధ్య నిశ్శబ్దం తిష్ఠ వేసింది.

"అమ్మా! మేము వేరే ఇల్లు....మాకు.''

"అవును బాబూ! మీకే. భారతి ఒక్కర్తీ మాకందరికీ చేయలేకపోతోంది. అందుకని మీకోసం వేరే ఇల్లు చూశాను!''

శంకరానికి గుండె గొంతుకి అడ్డం పడినట్ల యింది. తనకు వచ్చే జీతంతో వేరే ఇల్లు అద్దెకు తీసుకుని వేరే సంసారం పెట్టడమా? ఇప్పుడైతే తండ్రి పెన్షన్ ఇంటి అద్దె కలసి వస్తున్నాయి. ఒక్క తన సంపాదనలో తానెలా అడ్జస్ట్ కాగలడు?



### బస్సు ప్రయాణమంటే భయమా?

బస్సు ప్రయాణం కొందరికి పడదు. మరి రాకపోకల సౌకర్యాలు చాలినంతగా అభివృద్ధి చెందని మన దేశంలో బస్సులో ప్రయాణం చెయ్యకుండా ఉండడమూ కుదరదు. మరి, బస్సు బయలుదేరగానే కొందరికి వాంతులు మొదలవుతాయి. అటువంటివారికి బస్సులో వెళ్ళడమంటేనే భయంగా ఉంటుంది.

అలా భయపడకుండా బస్సులో ప్రయాణం చెయ్యడానికి కొన్ని మార్గాలున్నాయి.

బస్సు వెడుతున్నప్పుడు - చెవిలోపలి భాగంలో అర్ధచంద్రాకారంలో ఉండే సున్నితమైన నాళాలు అదురుతాయి. అందువల్ల వాంతులు వస్తాయి. ఈ సమస్య ఉన్నవారు బస్సులో ప్రయాణం మొదలుపెట్టడానికి గంట ముందు వాంతులు రాకుండా తగిన మాత్రలు వేసుకోవాలి.

బస్సులో కూచున్నప్పుడు చాలామంది కిటికీలోంచి బయటకు చూస్తూ ఉంటారు. చెట్లు చేమలు వేగంగా వెనక్కు వెడుతున్నట్టు కనిపించడంవల్ల కనుగుడ్లు అటూ ఇటూ కదిలి వాటితో సంబంధమున్న నరాల ద్వారా చెవుల్లోని నాళాలలో ప్రేరణ కలుగుతుంది. ఈ బాధ తగ్గాలంటే వీలయినంతవరకు పక్కలకు తిరగకుండా సూటిగా చూస్తూ ప్రయాణం చెయ్యడం మంచిదని నిపుణుల అభిప్రాయం!

"అది కాదమ్మా! ఎలాగో అందరం కలసి చేసుకుంటున్నాంగా.'' అతను అన్నాడు గొంతు పెగుల్చుకుని.

"నీకు తెలియదు లేరా, నేను ఆలోచించే ఈ పని చేశాను!'' అన్నది సత్యవతి.

అప్పటికి భారతి తెప్పరిల్లింది. ఇంక రంగంలోకి దిగక తప్పదనుకుంది.

"అయినా ఇదేమిటండీ, ఇంత హఠాత్తుగా వెళ్ళిపొమ్మంటే ఎలా పోతాం? ఇన్నాళ్ళూ చేయగా లేనిది ఇప్పుడే నాకు కష్టమొచ్చిందని చెప్పానా?'' అంది విసురుగా. ఆ విసురుకి ఒళ్ళు మండిపోయింది సత్యవతికి. అయినా ఓర్పు తెచ్చుకుని, "అదేం కాదు భారతీ! నువ్వు 'నీ మొగుడికీ' నీ పిల్లలకీ చేయడమే న్యాయం. మా అందరికీ ఎందుకు చేయాలి?'' అన్నది.

"అదేమిటమ్మా! భారతి పరాయి మనిషి అయినట్టు మాట్లాడతావు? భారతి నీ కోడలు కాదా! నేనేమన్నానని నా మీద ఈ కోపం?'' చిన్నబోయాడు శంకరం.

కృష్ణవేణి మౌనం విడిచిపెట్టలేదు. రామయ్య గారు తనకేమీ పట్టనట్టు ప్రేక్షకుడిలా మౌనంగా ఉండిపోయాడు. ఆయనకు భార్య నిర్ణయాలపై, ఆలోచనలపై అచంచలమైన విశ్వాసం ఉంది. అందుకనే తనేం జోక్యం చేసుకోలేదు.

తండ్రి మౌనం శంకరాన్ని మరింత అయోమయంలో పడేసింది. ఇక లాభం లేదని తల్లి దగ్గరగా వచ్చి ఆమె పక్కన కూర్చున్నాడు.

"అమ్మా! మమ్మల్ని వెళ్ళగొడుతున్నావా?'' దీనంగా అడిగాడు.

సత్యవతి హృదయం క్షణం పాటు ఊగిసలాడింది. ఆ ప్రశ్న సన్నని చురకత్తితో గుండెనెవరో గంటు పెట్టినట్లయింది. త్రాచుపాములా బుసలు కొడుతున్న భారతిని చూడగానే ఆమె హృదయం తిరిగి వజ్రంలా కఠినమైంది.

"పిచ్చివాడివిరా శంకరం! తల్లి కొడుకుని వెళ్ళగొట్టడమేమిటి? దూరంగా ఉంటే అభిమానాలు నిలుస్తాయన్న తాపత్రయం అంతే!'' అన్నది ఆమె.

భారతి ఇక ఆగలేకపోయింది. "ఎందుకా మాటలు! కొడుకునీ కోడలినీ వెళ్ళగొట్టి ఊరి వాళ్ళకి ఆస్తి ధారపోయాలని ఉందని సూటిగా చెప్పవచ్చుగా? దానికి మేము అడ్డం వచ్చాం కాబోలు!''

ఆ మాటలు విని కోడలిని తీక్షణంగా చూసింది సత్యవతి. "భారతీ! నీ మొగుడికి సొమ్ము నువ్వు ఎంత ధైర్యంగా నీదంటున్నావో నా మొగుడికి సొమ్ము నాకూ అంతే. మరో విషయం బహుశా మీకు తెలియదేమో, ఈ ఇల్లూ ఆస్తీ నా పేర ఉన్నాయి. దాన్ని ఏమైనా చేసుకొనే హక్కు నాకుంది!"

ఈ కొత్త విషయం వినగానే నిర్ఘాంత పోయింది భారతి. అంతవరకూ అవన్నీ తన భర్త పేరు మీద వున్నాయని ఊహిస్తోందామె. ఆమె ఊహ తలకిందులైంది. ఇహ మొండికేస్తే లాభం లేదని రాజీమార్గంలో పడి, "కోడలిని నేను పరాయిదాన్ని కావచ్చు. మీ అబ్బాయి కూడా మీకు పరాయి వారయ్యారా అత్తయ్యా!" అని నీరసంగా అడిగింది.

సత్యవతి పెదవులపై నిర్వేదమైన నవ్వొకటి మెరిసి మాయమైంది.

"భారతీ! వాడింకా నా కొడుకని నేనెలా అనుకుంటానమ్మా! వాడు నీ మొగుడు. నా కూతురికి పెళ్ళి చేశాను. అల్లుడు ఆమెను 'నా భార్య' అన్నాడు. కొడుక్కి పెళ్ళి చేశాను. కోడలు వాణ్ణి 'నా మొగుడు' అంది. నాకు వీరిలో పెద్ద తేడా ఏం కన్పించలేదు. ఇకపోతే మా సంగతంటావా, పిల్లల్ని కన్నాం కనుక పెంచడం మా కర్తవ్యం. పెంచాము, పెద్ద చేశాము. అంతే...అంతకుమించి వారి నుంచి ఆశించగలిగేది ఏదిలేదని అర్థం అయింది. చాలు, జీవితంలో మరిచిపోలేని నిజం ఇది! ఇక నువ్వు ఊరివాళ్లు ఊరివాళ్లు అని పదేపదిసార్లు అంటున్న మా అక్కయ్యే కనుక వాడిని చేరదీసి చదివించక పోతే 'నీ మొగుడు' ఇంతవాడయ్యేవాడు కాదమ్మా! డబ్బు పారేసి అభిమానాన్ని కొనలేం. ఆ అక్కయ్య కూతురు వితంతువై అత్తవారు ఆదరించక దిక్కులేనిదైతే చేరదీయటం మనిషిగా నా బాధ్యత. మానవత్వం, కృతజ్ఞత ఉన్న ఏ మనిషైనా ఈ మాత్రం చేస్తాడు. నేనూ అదే చేశాను. కానీ వాళ్ళని నా ఇంట ఉంచుకున్నది అనుక్షణం అవమానాలపాలు చేయడానికి కాదు-వాళ్ళకీ రక్షణ కల్పించడానికి, నీడనివ్వడానికి. దాన్ని కాదనే అధికారం ఎవరికీ లేదు. అన్నా లక్ష్యపెట్టాల్సిన అవసరం నాకు లేదు!" అన్నది ఆమె.

"అంటే మీ అబ్బాయి ఎలా బాధపడినా ఫర్వాలేదన్నమాట?" ప్రశ్నించింది భారతి.



పగిలే పాదాలకు....

వేసవికాలం వస్తే కొందరికి పాదాలలో పగుళ్ళు ఏర్పడుతూ ఉంటాయి. చర్మంలోని తేమ తగ్గడం వల్లగానీ, సూక్ష్మజీవుల వల్ల గానీ, అలర్జీమూలంగా గానీ పాదాలలో పగుళ్ళు రావచ్చు. వేసవిలో వేడి పెరిగే కొద్దీ పగుళ్ళు ఎక్కువవుతాయి.

పాదాలను బాగా కడుక్కుని శుభ్రంగా ఉంచుకోవడం వల్ల పగుళ్ళను అరికట్టవచ్చు. పాదాలకు పెట్రోలియం జెల్లీ రాయడం, మెత్తని చెప్పులు తొడుక్కోవడం - పగుళ్ళు రాకుండా చేస్తాయి.

తడిగా ఉండే ప్రాంతాలలో తరచుగా పనిచేయవలసివచ్చేవాళ్ళు చెప్పులు తొడుక్కుని పని చేస్తే పాదాలు పగిలే ప్రమాదం అంతగా ఉండదు!

"నా మొగుడు అని ధైర్యంగా చెప్పినదానివి వాడి బాధలు పడకుండా సుఖపెట్టలేవా? నా అల్లుడు నా కూతురి బాధ్యత ఎలా తీసుకున్నాడో అలాగే నీ మొగుడిని నువ్వు కూడా జాగ్రత్తగా చూసుకో!" అని శాంతంగా చెప్పింది.

"చూడమ్మా భారతీ! తల్లీ తండ్రీ, పిల్లలూ, మనుమలూ అందరూ ఒకచోట కలిసి కట్టుగా మమతలు నిలుస్తాయని, ఇంత క్రమశిక్షణా, ఇన్ని ప్రయోజనాలు ఉంటాయని మన పూర్వీకులు ఈ కుటుంబం అనే వ్యవస్థను ఏర్పరిచారు. కానీ కాలక్రమేణా ఈ వ్యవస్థలో బాగా అంతరాలొచ్చాయి. దానికి కారణాలు కొంతమటుకు జీవన ప్రమాణాలు. కొంత మనుష్యులలో పేరుకుంటూ వస్తున్న స్వార్థం, ఆర్థిక సమస్యలకు లోనైన కొన్ని సంసారాల్లో కలతలు వస్తే, ఆస్తి అంతా తామే అనుభవించాలన్న స్వార్థం వల్ల కొన్ని సంసారాలు విచ్ఛిన్నమౌతున్నాయి.

"ఒకప్పుడు ఇంట్లో ఎంత ఎక్కువమంది ఉంటే అంత విలువ ఇచ్చి పిల్లని ఇచ్చేవారు. ఇప్పుడు కాలం ఎంతగా మారిపోయిందంటే పెళ్ళయిన మూడవనాటి నుంచి ఆ కొత్త కోడలికి అత్తామామా మెడకి గుదిబండల్లా కన్పిస్తారు. వాళ్ళు తన భర్త సంపాదన తినిపోవడానికి కూర్చున్న రాబందుల్లా అన్పిస్తారు. కానీ వాళ్ళు కని పెంచి అంతవాడిని చేయకపోతే తన భర్త అనే ఆ జీవ పదార్థం ఉండేది కాదు అని ఆ సమయంలో గుర్తుకురాదు. అలాంటి పరిస్థితిలో ఆ కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయతానురాగాలు కలలో కూడా కన్పించవు. ఇలా అనుక్షణం కలతల మధ్యా కలహాలమధ్యా కలసిఉండే కన్నా ఎవరిదారి వారు చూసుకోవడం మేలు! దూరాన ఉంటేనైనా కనీసం నీ మొగుడికి ఒకసారి అమ్మను చూడాలనిపిస్తే వస్తాడు. అలానైనా కొన్నాళ్ళు ఈ అభిమానాలు ఉంటాయో ఏమో!" సుదీర్ఘమైన ఆ ఉపన్యాసానికి భారతికి నోటమాట రాలేదు. ఆమె, శంకరం ఇద్దరూ తమ గదిలోకి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయాక భార్య దగ్గరికి వచ్చాడు రామయ్య. "సత్యా! నువ్వు కొంచెం కఠినంగా ప్రవర్తించావనిపిస్తోంది!" అన్నాడాయన. ఆయన వైపు ఒకసారి చూసి తల పక్కకు తిప్పుకుంది సత్యవతి.

"తప్పలేదండి, కన్న తల్లినై ఉండి గుండెను బండగా మార్చుకున్నాను. వెళ్ళనివ్వండి. ఇక ఈ మమకారాలు మనకొద్దు!" అన్నది ఆమె.

"అవేం మాటలు సత్యా! వాడు ఎంతయినా మన బిడ్డ. ఏదో చిన్నవాళ్ళు..." అంటున్న భర్త మాటలకు అడ్డువచ్చి, చిన్నవాళ్ళు......వాళ్ళు కాదండీ, వాళ్ళు కన్న పిల్లలున్నారే వాళ్ళు చిన్న వాళ్ళు. ముగ్గురు బిడ్డల్ని కన్నారు, వీళ్ళా చిన్న వాళ్ళు? నా ఎదుటే వాడిని 'నా మొగుడు నా ఇష్టం' అన్నట్లు మాట్లాడితే అక్కడే ఉంటూ 'అవేం మాటలు భారతీ' అని ఒక్క మాట అనగలిగాడా? అంటే-ఆ మాట వాడు కూడా ఒప్పుకున్నట్లే కదా! ఇంకా వాడు మన బిడ్డ అని ఎలా అనుకుంటానండీ! నవమాసాలు మోసి, జలుబుచేస్తే తల్లడిల్లిపోతూ, జ్వరం వస్తే అల్లాడిపోతూ నా పొత్తిళ్ళతో పెంచినవాణ్ణి ఈనాడు నా మొగుడు అన్న ఒక్కమాటతో కొట్టిపారేసి నా స్థానాన్ని తెలియచెప్పింది. ఇంకా ఎందుకండీ అర్థం లేని ఆరాటాలు," ఆవేశం, ఆవేదన

ఆమె గొంతులో సుళ్ళు తిరిగాయి. అనునయంగా భార్యవైపు చూశాడు రామయ్య. "నువ్వు మామూలు ఆడదానిలాగే ఆలోచిస్తున్నావు సత్యా! ఆ అమ్మాయి అలా అంటే ఏం పోయిందీ? వాడు మన కొడుకు కాకపోతాడా?" అని అడిగాడు.


కళ్ళు వత్తుకుని నిబ్బరంగా తలెత్తింది సత్యవతి.

"కానివ్వండి. కాకపోనివ్వండి. నాకింక ఆ మమకారాలు అక్కర్లేదు. వెళ్ళనివ్వండి. వాడికి రెక్కల్లో శక్తి ఉంది. ఎలాగైనా బ్రతుకుతాడు. ఆ శక్తిలేనివాళ్ళం మనం. మనకు ఈ పాటి ఆధారం ఉండాలి. తన తల్లి జాలీ, కరుణా లేని రాక్షసి అని వాడు అనుకున్నా సరే. నేను ఈ మార్గం ఎన్నుకున్నాను. దీని వెంటదేపోతాను. నాలా ఏ తల్లీ ప్రవర్తించదు. నిజమే! కానీ ఇక ముందు నాలాగే ప్రతి తల్లి తన కన్న కడుపుని సైతం త్యజించి ఆ మమతల సంకెళ్ళు తెంచుకొంటే కానీ ఇలాంటి కొడుకులకు బుద్ధిరాదు!" అన్నది ఆమె.

"సత్యా!" ఆశ్చర్యంగా భార్యవైపు చూశాడు రామయ్య.

"అవునండీ, మనకైతే ఆస్తీ, ఈ ఇల్లూ ఉన్నాయి. కానీ ఈపాటి ఆసరా కూడా లేకుండా కేవలం కొడుకులపైనే ఆధారపడి ఉండే తల్లితండ్రులకు ఇలాంటి కొడుకులుంటే వాళ్ళ గతి ఏమవుతుందండీ! కని, పెంచి పెళ్ళి చేశాక ఆడపిల్లలను వదులుకున్నట్టే వాళ్ళను కూడా వదులుకోవడం తప్పనిసరైతే ఇలాంటి కొడుకులను కనటం దేనికి, పెంచటం దేనికి? చివరి సమయంలో ఆదరిస్తారని, ఆదుకుంటారని, ఆసరాగా ఉంటారని గంపెడాశతో ఉండే తల్లితండ్రులకు వీళ్ళు మిగిల్చేది ఏమిటండీ! తీరని నిరాశ, ఆవేదన! ఇలాంటి వాళ్ళపట్ల మమకారం చంపుకున్నా, మనస్సు పాషాణం చేసుకున్నా అది కాఠిన్యం అనిపించుకోదు. అంతేకాదు ఇలాంటి కొడుకుని కన్న ఏ తల్లి అయినా వాళ్ళను పెంచడం తన డ్యూటీలా భావించి పెంచాలేతప్ప వారి మీద ఎటువంటి ఆశలూ పెట్టుకోకూడదు. వాళ్ళనుంచి కాస్తంత ఆప్యాయతా, ఆదరణా ఆశించకూడదు. అంతే కదండీ! ఇదిగో, మీకు బాధగా ఉందేమో, కానీ నాకేం బాధగా లేదు. నిజంగా నేను బాధపడటం లేదు!" అంటూనే రెండు చేతుల్లో ముఖం దాచుకుని బావురుమంది సత్యవతి. □

# తీరిక వేళల్లో



## ఇంధనం పొదుపుచేసే ఎండుగడ్డి పెట్టె

ఎండుగడ్డి పెట్టె తయారు చేసుకుని గ్యాసు, బొగ్గు, కట్టెలు, కరెంటు, కిరసనాయిలు లాంటి ఇంధనాలను పొదుపుచేయవచ్చు. ఈ పెట్టెను తయారు చేయడం కూడా సులువే.

మామూలు పొయ్యి మీద వంటకాలని ఒక ఉడుకు ఉడికించి ఈ పెట్టెలో పెడితే అవి తమలో గల వేడిమిని ఉపయోగించుకుని పూర్తిగా ఉడుకుతాయి. మాంసం, పప్పులు, బంగాళా దుంపలు, బియ్యం లాంటి ఆలస్యంగా ఉడికే ఆహార పదార్థాలను దీంట్లో ఉడికించవచ్చు.

దీంట్లో పెట్టిన వంటకాలు రెండు మూడు గంటలవరకు తాజాగా ఉంటాయి. వాటి రుచి, వాటిలోగల విటమిన్లు భద్రంగా ఉంటాయి. పాత్రలు కూడా పొగచూరకుండా ఉంటాయి.

కావలసినసామగ్రి: ఒక 30 అంగుళాల పొడవు, 20 అంగుళాల వెడల్పు, 15 అంగుళాల ఎత్తుగల



మూత ఉన్న కొయ్యపెట్టె లేదా వంట ఇంట్లో ఒక మూల చిన్న చిన్న గోడలు కట్టి పెట్టె తయారు చేసుకోవచ్చు. దీనికి కొయ్య మూత ఏర్పాటు చేయాలి.

రెండు: ఎండుగడ్డి, వరి ఊక లేక రంపపు పొట్టు.

మూడు: బిగువైన మూతగల మట్టికుండ. కావలసిన నీరు, ఆహార పదార్థం కుండలో పోయగా కుండమూతి వరకు వచ్చే సైజులో కుండ వుండాలి.

నాలుగు: పెట్టె అంత వెడల్పు, పొడవుగల ఎండుగడ్డి దిండు. దీనిని గోనె గుడ్డతో కుట్టి దీంట్లో మూడు అంగుళాల మందాన ఎండుగడ్డి కూరాలి.

పెట్టెను సిద్ధం చేయడం: పెట్టెలో రెండు అంగుళాల మందాన వరి ఊక లేక రంపపుపొట్టు పోసి దానిపై రెండు అంగుళాల మందాన ఎండుగడ్డి పరవాలి. గడ్డిలో కుండని పెట్టి కుండ చుట్టూ గడ్డి అమర్చాలి. ఇప్పుడు కుండని తీయగా గడ్డి మధ్యలో గొయ్యి ఏర్పడుతుంది.

పెట్టెలో వంటకాలు పెట్టడం: మచ్చుకి అన్నం వండాలనుకోండి. కుండతీసి బియ్యం పోసి పొయ్యి మీద 10-15 నిమిషాలు ఉడకనీయాలి. అప్పుడు కుండ మీద మూత పెట్టి దింపి గడ్డి పెట్టెలో ఏర్పడ్డ గొయ్యిలో పెట్టాలి. దాని మీద దిండు ఉంచి పెట్టె మూత వేసేయాలి. గంటలో అన్నం తయారవుతుంది.

—పులిగడ్డ రత్నమాల